ఆంధ్రజ్యోతి

andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 | కనిష్ఠం 24.9



బస్సుల సమయపాలనకు ఫోన్ నెంబర్ల ఏర్పాటు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోలకు చెందిన బస్సు సమయపాలనను తెలుసుకోవడానికి ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేసినట్లు నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. ఆర్మూర్ 7382843133, బోధన్ 9849500725, నిజామాబాద్ 9959 226022, బాన్సువాడ 9491105706, కామారెడ్డి 7382843747 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం జ్యోత్స్న తెలిపారు.

వడ్డీ వ్యాపారులపై కొరడా



● బోధన్‌లో వడ్డీ వ్యాపారి ఇంటిపై దాడులు నిర్వహిస్తున్న పోలీసులు



● నగరంలో..



సిరికొండలో దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

- » జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించిన పోలీసులు
- » రూ.67లక్షల 41వేల 666 నగదు స్వాధీనం
- » 1435 ప్రామిసరీ నోట్లు, 31 ఫైనాన్షియల్ నోట్స్ స్వాధీనం
- » ఆన్‌లైన్ బెట్టింగ్‌తోపాటు వడ్డీ వ్యాపారులపైన ప్రత్యేక దృష్టిపెట్టిన సీపీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝులిపించారు. పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు గురువారం తెల్లవారుజామున నుంచి నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 20కి పైగా బృందాలు ఈ సోదాలలో పాల్గొన్నట్లు సమాచారం. సామాన్యుల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్న వారిని గుర్తించి భారీ మొత్తంలో నగదుతో పాటు ప్రామిసరీ నోట్లు, ఫైనాన్షియల్ నోట్స్, సేల్ డీడీలు, వాహనాలు, బాండ్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 67లక్షల 41వేల 666 రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లాలో అధిక వడ్డీ పేరుతో పేద మధ్య తరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వడ్డీ వ్యాపారుల చిట్టాను పోలీసులు ఇదివరకే స్వాధీనం చేసుకున్నారు. గతంలో జిల్లాలో చాలా మంది వడ్డీ వ్యాపారుల వేధింపులకు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు జిల్లాలో అధిక వడ్డీలను వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సీపీగా బాధ్యతలు స్వీకరించిన సాయిచైతన్య బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ బెట్టింగ్ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో వడ్డీ వ్యాపారులపై ప్రత్యేక దృష్టిపెట్టి జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు నిర్వహించడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

వడ్డీ వ్యాపారుల వేధింపులు

జిల్లాలో వడ్డీ వ్యాపారుల వేధింపులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. మూడు నుంచి పది రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తూ వడ్డీలు తీసుకున్న వారు చివరకు తమ ఆస్తులను అమ్ముకునే పరిస్థితి వరకు వడ్డీ వ్యాపారులు ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. గతంలోనూ వడ్డీ వ్యాపారుల విషయంలో అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో వడ్డీ వ్యాపారుల ఆగడాలు ఆగలేదు. గతంలో గంగాస్థాన్‌లో ఓ కుటుంబం వడ్డీ వ్యాపారుల ఇబ్బందులకు విజయవాడలో ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. అదేవిధంగా నగరంలోని కపిలా హోటల్‌లో ఓ కుటుంబం వడ్డీ వ్యాపారుల ఆగడాలకు ఆత్మహత్య చేసుకుంది. ఇటీవల కాలంలో న్యాల్‌కల్ రోడ్‌లో ఉండే తండ్రీ కూతురు వడ్డీ వ్యాపారుల ఇబ్బందులకు బాసర గోదావరి నదిలో ఆత్మహత్య చేసుకోగా తండ్రి మృతి చెందగా కూతురు ప్రాణాలతో బయటపడింది. వడ్డీ వ్యాపారులపై ఫిర్యాదులు వస్తేతప్ప పోలీసులు స్పందించడం లేదు. గతంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసి స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసే పోలీసు అధికారులు వడ్డీ వ్యాపారులతో కలిసి ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో నూతనంగా పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయిచైతన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అక్రమ దందాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో జిల్లాలో కిందిస్థాయి పోలీసు అధికారులు సైతం ఇప్పుడు వాటిపై దృష్టి పెట్టారు.

ప్రభుత్వ ఉద్యోగులే అధికం

జిల్లాలో అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వ్యాపారం నిర్వహిస్తున్న వారంతా ఎక్కువ శాతం ప్రభుత్వ ఉద్యోగులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులే జిల్లాలో వడ్డీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులే ఎక్కువగా వడ్డీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు ఓ అంచనాకు వచ్చారు. ఈ మేరకు వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారి జాబితాను సిద్ధం చేశారు. నగరంలోనూ 5 కోట్ల నుంచి 10కోట్ల వరకు టర్నోవర్‌తో వడ్డీ వ్యాపారం చేస్తున్న వారు పదుల సంఖ్యలో ఉన్నారు. గంజ్‌లో వ్యాపారులు సైతం వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసుల దాడుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారుల్లో అలజడి నెలకొంది. గుట్టుచప్పుడు కాకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్నవారంతా పోలీసుల దాడులతో అప్రమత్తం అయ్యారు. కొంత మంది వడ్డీ వ్యాపారాలు చేసుకునేవారు తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులకు సహకరించారు. కానీ కోట్లకు పైగా వడ్డీ వ్యాపారం చేసేవారు ఈ దాడులలో దొరకనట్లు తెలుస్తోంది. మరోసారి పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి వడ్డీ వ్యాపారుల గుట్టు లాగితే మరికొంత మంది వడ్డీ వ్యాపారులు పోలీసులకు చిక్కే అవకాశం ఉంది.

67లక్షల 41వేల 666 నగదు స్వాధీనం..

జిల్లా వ్యాప్తంగా గురువారం పోలీసులు అక్రమ వడ్డీ వ్యాపారులపై జరిపిన మెరుపు దాడుల్లో భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్ సైతం లేకుండా అనేక మంది అక్రమంగా ఫైన్స్ ఏర్పాట్లు చేసుకొని అక్రమ వడ్డీ దందా నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో జిల్లా వ్యాప్తంగా 67లక్షల 41వేల 666 రూపాయల నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు 31 ఫైనాన్షియల్ నోట్స్, 1435 ప్రామిసరి నోట్స్, 43 సేల్ డీడీలు, 3 వాహనాలు, 30 బాండ్ పేపర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల మెరుపుదాడులు..

బోధన్‌రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అనేక మంది అక్రమంగా ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్నారని ఫిర్యాదుల మేరకు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై గురువారం తెల్లవారుజామున దాడులు నిర్వహించామని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సామాన్య, పేద కుటుంబాలకు చెందిన వారి అవసరాలను ఆసరాగా చేసుకుని ఫైనాన్స్ పేరుతో వారి వద్ద నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారి వద్ద లభ్యమైన ప్రాంసరీ నోట్లు, వెహికిల్స్, బాండ్ పేపర్లు, 59లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఫైనాన్స్ వ్యాపారుల అరెస్టు..

మోర్తాడ్ : మండల కేంద్రంలో ఫైనాన్స్ వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఎస్సై విక్రం ఆధ్వర్యంలో ఆరుగురు ఫైనాన్స్ వ్యాపారులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ప్రామిసరీ నోట్లు, ఫైనాన్స్ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

నవీపేటలో..

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన క్రాంతికుమార్ అనే వడ్డీ వ్యాపారి ఇంటిపై గురువారం దాడులు నిర్వహించారు. 103 వేర్వేరు పేర్లపై ఉన్న ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ 29.79లక్షల వరకు ఉంటుందని ఎస్సై వినయ్ తెలిపారు. అలాగే రోజువారి ఫైనాన్స్‌కు సంబంధించిన 14చిన్న నోట్ బుక్‌లు, ఏడు లాంగ్ నోట్‌బుక్‌లను సీజ్ చేయడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా డైలీ ఫైనాన్స్‌తో పాటు అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తున్నాడనే కారణంపై అతనిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సిరికొండలో..

సిరికొండ: మండలంలో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తుల ఇళ్లపై పోలీసులు దాడులు చేశారు. ఎస్సై ఎల్. రామ్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున సిరికొండ, మైలారం, గడ్కోల్, కుర్దుల్‌పేట్ గ్రామాల్లో వడ్డీ వ్యాపారాలు నిర్వహించే వ్యక్తుల ఇళ్లపై దాడులు నిర్వహించారు. సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి కోటి 75 ల టక్షల ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

అధిక వడ్డీలు వసూలు చేస్తే కఠిన చర్యలు..

: సాయిచైతన్య, పోలీసు కమిషనర్



జిల్లాలో అనుమతులు లేకుండా, రిజిస్ట్రేషన్ లేకుండా అధిక వడ్డీలు వసూలు చేసే అక్రమ వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. సామాన్యులను ఇబ్బందులకు గురిచేసే వారిపై ఖచ్చితంగా చర్యలు ఉంటాయి. ఇప్పటికైనా అక్రమ వడ్డీ దందా చేస్తున్నవారు తమ దందాను నిలిపివేయాలి.

భూ భారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ● భూములపై యాజమాన్య హక్కులు కల్పించేందుకే భూ భారతి
- ● రెవెన్యూ సదస్సులో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



కమ్మర్‌పల్లి రెవెన్యు సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టాన్ని అమలు పరుస్తుందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో జిల్లాలోనే మొదటగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం కీలక అంశాలపై ఒక్కొక్కటిగా వివరిస్తూ అవగాహన కల్పించారు. కొత్త ఆర్వోఆర్ చట్టం రైతుల చుట్టమని, భూమి హక్కుల భద్రం, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక మార్పులు చేసిందని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు భూ భారతి చట్టం వివరాలను స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీ వో రాజా శ్రీనివాస్, ఇతర అధికారులు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మండల ఐకేపీ ఆధ్వర్యం లో మహిళా సంఘాల సభ్యులు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును శాలువా కప్పి సన్మానించారు.

ఆర్వోఆర్ చట్టంపై అవగాహన

మోర్తాడ్ : వివాదాలకు తావులేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి ఆర్వోఆర్ చట్టాన్ని తెచ్చిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మాంత్ అన్నారు. గురువారం మోర్తాడ్‌లో భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టంపై ఏర్పాటు చేసిన రైతుల సదస్సులో మాట్లాడారు. భూ భారతి చట్టంపై అందులోని అంశాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. తిమ్మా పూర్‌కు చెందిన పుప్పాల నరేష్, దర్మోర, మోర్తాడ్ గ్రామాలకు చెందిన రైతులు ధరణి వల్ల తమకు జరిగిన అన్యాయాన్ని వివరించగా ఆర్డీవో రాజాగౌడ్ వారితో మాటాడారు. మే మొదటి వారంలో రెవెన్యూ అధి కారులు వస్తున్న ప్పుడు తమ అర్జీలు పెట్టుకో వాలని అన్ని సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు మహిపాల్, రంజిత్, నవీద్, సొసైటీ చైర్మన్ సింగి రెడ్డి రాజేశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ భూమన్న, తహసీల్దార్ క్రిష్ణ, ఆర్ఐ రంజిత్, ఎంపీడీవో తిరుమల, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డు మాదిరిగానే భూధార్ కార్డు

ఏర్గట్ల: భూ భారతి ద్వారా రెతులకు ఆధార్ కార్డు మాదిరిగానే భూధార్ కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. గురువారం మండలంలోని బట్టాపూర్ గ్రామంలో భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజా గౌడ్, తహసీల్దార్ మల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ విష్ణువర్ధన్, ఆర్ఐ సదానంద్, కిరణ్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



నగరంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి చార్జ్‌షీట్ నమోదు చేసినందున నిరసనగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు గురువారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వ్యవస్థలన్ని నిర్వీర్యం చేస్తూ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనాన్ని వెతికి తీస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని అన్నారు. కుట్ర పూరితంగానే బీజేపీ పాలనపై పోరు చేస్తున్న సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై అక్రమంగా ఈడీ కేసులు పెట్టి చార్జ్‌షీట్ నమోదు చేశారని ఇది దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జావిద్ అక్రమ్, వేణురాజ్, విపుల్‌గౌడ్, బొబ్బిలి రామకృష్ణ, సుమన్, రేవతి, శ్రీనివాస్, ఉషా, మధు, ప్రమోద్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌ను పరిశీలించిన డీఎంఈ

- » మంత్రి, ప్రభుత్వ సలహాదారు ఆదేశాలతో క్షేత్రస్థాయిలో డీఎంఈ సందర్శన
- » సౌకర్యాల కల్పనపై కలెక్టర్‌తో చర్చించిన అధికారులు



ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణను పరిశీలిస్తున్న డీఎంఈ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని డీఎంఈ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్రకుమార్ నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం గురువారం పరిశీలించింది. డీఎంఈతో పాటు రాష్ట్ర ఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజనీర్ దేవేందర్, ఇతర అధికారులు ఆసుపత్రికి చేరుకొని నిర్వాహణ తీరుతెన్నులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చేపట్టాల్సిన మరమ్మతు పనుల గురించి క్షేత్రస్థాయి పర్యటనలో ఉన్న కలెక్టర్‌తో గూగుల్‌మీట్ ద్వారా చర్చించారు. ఇటీవల జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలు హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో వారి ఆదేశాల మేరకు డీఎంఈ నేతృత్వంలోని బృందం గురువారం జీజీహెచ్‌ను సందర్శించింది. సాధారణ ప్రసవాల సంఖ్య తగ్గిపోవడం, మెడికల్ కళాశాలకు అనుబంధంగా కొనసాగుతూ ఆయా విభాగాలకు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నప్పటికీ పలు అత్యవసర కేసులను హైదరాబాద్‌లోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు పంపిస్తుండటం పై ఉన్నత స్థాయి సమీక్ష సందర్భంగా సమావేశంలో చర్చించారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగు పరిచేందుకు అత్యవసరంగా మరమ్మతు పనులను చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరమ్మతుల కోసం మంజూరైన నిధులు వాటిని వెచ్చిస్తూ చేపట్టిన పనుల పురోగతి, పెండింగ్ పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వాహణను మరింత మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్‌తో చర్చించారు.

బెల్ట్ జోరు.. పల్లె బేజారు





● ఎడపల్లిలో అధికారుల దాడుల దృశ్యం (ఫైల్)

- » గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అక్రమ విక్రయాలు
- » స్థానిక వైన్స్‌ల నుంచి బెల్టుషాపులకు మద్యం తరలింపు
- » చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

బోధన్ డివిజన్ పరిధిలో ఇదీ పరిస్థితి

రెంజల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పల్లెలు బెల్ట్‌షాపుల మద్యం జోరుతో బేజారవుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా బెల్ట్‌షాపుల దందా కనిపిస్తోంది. బోధన్ డివిజన్‌లో వ్యాపారులు నిబంధనలను ఉల్లంఘించి మద్యం దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. సిండికేట్‌గా మారి మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో వ్యాపారులకు గొడుగు పడుతున్నారు. అధికారుల అండదండలతో అనధికార బెల్టు షాపులు యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులైపారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు జరపరాదని నిబంధనలు ఉన్నాయి. వేలంపాటలో లక్షలు వెచ్చించి బెల్టు షాపులను దక్కించుకుంటున్నారు. ఒక్కొక్క గ్రామంలో మద్యం షాప్‌కు రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు వ్యాపారులు గ్రామాభివృద్ధికి డబ్బులు కట్టి తమ దందాను కొనసాగిస్తున్నారు. దీంతో సాయంత్రం వేళ గ్రామాల్లో మద్యం ప్రియులు కిక్కుతో గొడవలకు దిగుతున్నా సందర్భాలు ఉన్నాయి. ఈ తతంగమంతా బాహాటంగా జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు తమ ఆదాయం కోసం ఇష్టమొచ్చిన రీతిలో మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విస్తరిస్తున్న వ్యాపార సామ్రాజ్యం

బోధన్ డివిజన్ పరిధిలో మండలాలు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వ్యాపారం మరింత విస్తరించి మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. ఇప్పటికే డివిజన్ పరిధిలో ఉన్న మద్యం వ్యాపారులు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని నియోజకవర్గం అంత విస్తరింపజేశారు. గ్రామాల్లో బెల్టు షాపులను పెట్టించడం వారికి మద్యాన్ని పంపిణీ చేసి లక్షలాది రూపాయలు దండుకోవడం అంత నిబంధనలకు విరుద్ధమే అయినప్పటికీ ఎక్సైజ్ యంత్రాంగంలో ఏ మాత్రము కదలిక లేదు. నవీపేట, రెంజల్, ఎడపల్లి మండలాల్లో యథేచ్ఛగా మద్యం అక్రమ వ్యాపారం సాగుతున్నా వీరిపై నిఘా ఉండ డం లేదు. అలాగే దాబాల్లో ఇష్టారీతిన అక్రమ సిట్టింగులకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టాల్సిన అవసరముంది.

పెంటాఖుర్దు పాఠశాల సందర్శన



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంటాఖుర్దు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఏఏ సబ్జెక్టులో బలహీనంగా ఉన్నారో గుర్తించి వారికి ఆయా సబ్జెక్టులో అర్థమయ్యేలా బోధించి ఉత్తీర్ణులు అయ్యేలా చూడాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచాలని ప్రధానోపాధ్యాయున్ని ఆదేశించారు.

భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



పోలీసుల గౌరవవందం స్వీకరిస్తున్న సీపీ

భీమ్‌గల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సాయిచైతన్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. కేసుల ఫైల్‌ను పరిశీలించి పలు విషయాలను సీఐ సత్యనారాయణ గౌడ్ ఎస్సై మహేష్‌ను అడిగి తెలు సుకున్నారు. అనంతరం సీపీ సాయి చైతన్య మాటాడుతూ శాంతి భద్ర తల పరిరక్షణకు పోలీసులు క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. గంజాయి, వడ్డీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని గ్రామాలలో చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ వెంట ఆర్మూర్ ఏసీపీ, ఎస్సైలు ఉన్నారు.

పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలి



చిన్నారులకు అన్నప్రసరణ చేస్తున్న అంగన్‌వాడి సూపర్‌వైజర్

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడి సూపర్ వైజర్‌లు నలిని, వెంటకరమణమ్మ తెలిపారు. గురువారం పట్టణంలోని అశోక్‌నగర్, హుస్నాబాద్ అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 7 నెలల చిన్నారులకు అన్నప్రసరణ కార్యక్రమాన్ని నిర్వహించి పోషక విలువలుగల ఆహారాన్ని ఎలాతయారు చేసుకోవాలో ఆమెతెలియజేశారు. అనంతరం గర్భవతులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడి టీచర్ పద్మ, ప్రతిభ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటగిరి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కోటగిరి డిప్యూటీ తహసీల్దార్ మధు సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని రచ్చగల్లీ అంగర్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మ ఆధ్వర్యంలో మండల స్థాయి పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కిషోర బాలికలలో ఉండే రక్తహీనతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, అర్హులైన గర్భవతి మహిళలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శంకర్, మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి, ఏపీఎం గంగారాం, మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ రాణి, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త రాంబాబు, మండల అంగన్‌వాడీ టీచర్లు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం వేల్పూర్ సెక్టర్ పరిధిలో గ్రామ పంచాయితీ భవనంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సీహెచ్‌వో నారాయణ, శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలుసమంత, రాధిక, అంగన్‌వాడి టీచర్లు వసంత, వీణ,సరోజ,మీనాకుమారి,రూపలత, మంజుల, శ్రావణ్య పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని మావందిఖుర్దు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో పద్మజ మాట్లాడుతూ గర్భవతులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట రమణ, గ్రామ సెక్రెటరీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):మండలంలో అన్ని గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశారు. గురువారు మండలంలోని మెండోర, లాఖ్యానాయక్ తండా, బాబానగర్, తాళ్లకుంట తండా, పురానిపేట్ గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించారు.ఆయన వెంట మిషన్ భగీరథ ఏఈ అమూల్య, గ్రామాల కార్యదర్శులు,కారోబార్లు తదితరులున్నారు.

అనుమతులు లేకుండా మొరం తరలిస్తే చర్యలు

ఎడపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం ఎడపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ టిప్పర్‌లో అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచా రం మేరకు తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలించడంతో టిప్పర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. అక్రమం గా అనుమతులులేకుండా మొరం,ఇసుకతరలిస్తే చర్యలు తప్పవ న్నారు.

బీజేపీ కార్యకర్తలకు బీమా సౌకర్యం

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలకు ఎటువంటి సహాయ, సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని బాన్సువాడ నియోజకవర్గ నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ హామీ ఇచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం వందమంది బీజేపీ కార్యకర్తలకు తపాలా శాఖ ఆధ్వర్యంలో భీమా సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, శ్యామల, రాజు, శ్రీనివాస్, రాజాగౌడ్, సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

బోధన్‌రూరల్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని పాండుఫారం, ఆటోనగర్, బెల్లాల్ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను, ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరిగింది. కాని ఇప్పటి ఆ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించలేదని సీపీఎం నాయకులు శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్‌తో పాటు కాలనీవాసులు గురువారం తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, గోపి, దత్తు, ప్రభాస్, తాహెరా బేగం, పోచమ్మ, రాజవ్వ, తిమ్మప్ప, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి అమానుషం'



మోర్తాడ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):భీమ్‌గల్‌లో బుధవారం జరిగిన మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని మండల టీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్యాణలక్ష్మీ, షాదీము బారక్ లబ్ధిదారులకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని సీఎం ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించినందుకు టీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయించ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ రవి, మాజీ వైస్ఎంపీపీ శ్రీనివాస్, వీపీటీఎస్ బద్ధం అశోక్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు చిరంజీవి, కల్లెడ ఏలియా, మాజీ ఎంపీటీసీలు అశోక్, బోగ ఆనంద్, ఏనుగు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

● సీఎంపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు

కమ్మర్‌పల్లి: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.లక్షలతో పాటు తులంబంగారం ఇస్తామని మోసం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసునమోదు చేయాలని కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చి16 నెలుగడుస్తున్న తులం బంగారం ఊసేలేకుండా పోయిందని. ఇదేవిషయాన్ని నిన్న(బుధవారం) భీమ్‌గల్ పట్టణంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో జరిగిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ప్రతిపక్ష ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి లబ్ధిదారుల పక్షాన ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని మంత్రి జూపల్లి, పోలీసులను ఉసిగొల్పి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జి చేయించడం అమానుష చర్య అని తీవ్రంగా ఖండించారు. లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామన్న హామీని విస్మరిస్తూ మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసునమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, మాజీ సర్పంచ్‌లు గడ్డం స్వామి, బక్కూరి గోపి, దయ్యదేవయ్య, మాజీ వైస్ ఎంపీపీ కలేరి శేఖర్, మాజీ ఎంపీటీసీలు సుధాకర్, పిప్పెర అనిల్, గంగాధర్, కోనాపూర్ సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ప్రకాశ్ నాయక్, నాయకులు ఆవారి మురళి, రెంజర్ల మహేందర్, కేకే నరేందర్, కోరె నర్సయ్య, మహేష్, పేరం లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రశ్నించిన నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జీ చేయించడాన్నితీవ్రంగా ఖండించారు.ఎన్నికల హామీలను అమలుచేయాలన్నారు.

బాల్కొండ: బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని బాల్కొండ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్ధం ప్రవీణ్‌రెడ్డి అన్నారు. గురువారం బాల్కొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరినందుకు పోలీస్‌లచే బీఆర్ఎస్ నాయకులను కొట్టించడం ఎంతవరకు సమంజసమన్నారు. లాఠీచార్జి చేసిన పోలీస్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ సురాజ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దాసరి వెంకటేష్, ప్రసాద్‌గౌడ్, సాగర్‌యాదవ్, సాయన్న, శ్రీకాంత్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: రాజకీయ పార్టీల నాయకులు నిరసన తెలిపితే లాఠిచార్జి చేయడం సిగ్గుచేటని డీసీసీబీ డైరెక్టర్ మండల పార్టీ అధ్యక్షుడు నాగంపేట శేఖర్ అన్నారు. గురువారం మెండోరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాల్కొండ నియోజక చరిత్రలో ఏనాడు కూడా లాఠిచార్జి జరగలేదని మంత్రి జూపల్లి వచ్చిన సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ప్లాకార్డుతో నిరసన తెలిపితే మంత్రి వెళ్లిన తర్వాత బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేసి స్థానిక నాయకులు పోలీస్‌లను ఇసుగొలిపి లాఠిచార్జి చేయించడం ఎంతవరకు సమంజసం అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తలారి గంగాధర్, నవీన్‌గౌడ్, మచ్చర్ల రాజారెడ్డి, సామగంగారెడ్డి, గోపిడి గంగారెడ్డి, రవిగౌడ్, బాబా, రాజు, వెంకట్, దేవేందర్ పాల్గొన్నారు.

వేల్పూర్: భీమ్‌గల్‌లో మంత్రి సాక్షిగా బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జికి కారకులైన కాంగ్రెస్ నాయకులు పోలీస్‌లపై చర్యలు తీసుకోవాలని వేల్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వేల్పూర్‌లో పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రిని విన్నవించడానికి వెళ్లిన తమ బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల సంఖ్య బలం బాగా ఉన్నప్పటికి తాము సమన్వయం పాటించి తులం బంగారం ఇవ్వాలని నిరసన తెలుపుతున్న క్రమంలో కాంగ్రెస్ నాయకుడు సునీల్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు పోలీసులు లాఠీచార్జి చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జైడి నాగధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు సామ మహిపాల్, రేగు ల రాములు, ప్రతాప్‌రెడ్డి, డొల్ల రాజేశ్వర్‌రెడ్డి, నల్లరమేష్, కే. శ్రీనివాస్‌రెడ్డి, పిట్ల సత్యం, శ్యాంరావ్, మొండి మహేష్, మోహన్‌దాస్, సుంకరి రాము, ఆమోస్, ఏలేటి మోహన్, బోజన్న, నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. భీమగల్‌లో బిఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి నేడు లక్ష రూపాలే ఇవ్వడం పట్ల ప్రశ్నించినందుకు దాడులు పాల్పడం సరికాదని అన్నారు. ఇట్టి దౌర్జన్యానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం,మాజీఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జక్కని మధుసుధన్, బద్ధం ప్రభాకర్, రొక్కెడ మోహన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలి



అంకాపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రోహిత్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పశువుల పెంపకందారులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న గేదెజాతి, గోజాతి పశువులన్నింటికీ టీకాలు వేయించాలన్నారు. పాడి పశువుల పెంపకందారులు అధిక పాలదిగుబడి పొందేం దుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.వేసవిలో పాడి పశువులను జాగ్రత్తగా చేసుకోవాలని సూచించారు.అనంతరం గ్రామస్థులతో మాట్లాడి పశువై ద్యం అందుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో మండల పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్‌లక్కం ప్రభాకర్,పశువైద్య సిబ్బంది రాజేశ్వర్, శ్రీనివాస్ గౌడ్,రాధ,దివ్య, శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని దొన్కల్ గ్రామంలో గురు వారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈకార్యక్రమాన్ని జిల్లా పశువైద్యశాఖ, పశుసంవర్ధశాఖ సంచాలకులు డాక్టర్ రోహిత్‌రెడ్డి పర్యవేక్షించారు. పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడడంవల్ల నోటిలో పుండ్లతో సొంగ కారడం, కాలీ డెక్కాలలో పగుల్లు ఏర్పడి నడవలేక పోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, సూడి పశువుల్లో అబార్షన్ అవ్వడం వంటి లక్షణాలు ఏర్పడతాయని రైతులతో అన్నారు. రైతులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా పశువులకు వేయిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు అనిల్, ఏలేటి రాజేశ్వర్, అశోక్, బద్ధం అనిల్, పవువైద్యాధికారి డాక్టర్ గౌతంరాజు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎడపల్లి: పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు టీకాలు తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారి అన్నారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమం చేపట్టి పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది మహేందర్, సుశాంత్,పోశెట్టి, ఖాసిప్,పశుపోషకులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రంలో గురువారం 262 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైధ్యాధికారి గౌతంరాజు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పెద్దమనుష్యులు మహేష్, గంగాధర్, నర్సయ్య, పశువైద్య సిబ్బంది ప్రవీణ్, ప్రనీత్, షకీల్, మల్లేష్ పాల్గొన్నారు.

కోటగిరి: రుద్రూరు మండల కేంద్రంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని వైద్యాధికారి సంతోష్ ప్రారంభించారు. ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో 48గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం నుండి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించడం జరుగుతుందని నవీపేట వెటర్నరీ వైద్యుడు నరేందర్ తెలిపారు. మండలంలో సుమారు 11 వేల వరకు తెలుపు, నలుపు పశువులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మహంతం, అబ్బాపూర్(ఎం)లలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

జక్రాన్‌పల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని డీవీఏహెచ్‌వో అధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అర్గుల్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి హర్షిత, దేవీవో డాక్టర్ సంకీర్తన, వోఎస్‌లు సర్పంచ్‌లు గోర్త రాజేందర్, పద్మ, రైతులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి బాలిక ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులోని మహాలక్ష్మీ అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి చిట్యాల నీత (16) అనే బాలిక ఆత్మహత్య చేసుకుందని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చేపూర్‌లోని క్షత్రియ పాలి టెక్నిక్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యనభ్యసిస్తున్న నీత గత కొన్ని నెల లుగా కడుపునొప్పితో బాధ భరించలేక బుధవారం రాత్రి అపార్ట్‌మెంట్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని అన్నారు.మృతురాలి తల్లి మంజులా ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలి

● వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ

బోధన్‌రూరల్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. గురువారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 19న హైదరాబాద్‌లో విస్తృత సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.దివ్యాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగపిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. వికలాంగులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలన్నారు.

రైతులకు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన

బోధన్‌రూరల్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో గురువారం రైతులకు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంటాకలాన్ సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బోధన్ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్ రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో యూ డైస్ ప్లస్ వెరిఫికేషన్

నిజాంసాగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలలో గతంలో యు డైస్ ప్లస్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించడానికి డైట్ కళాశాలకు చెందిన ఛాత్రోపాధ్యాయులను పరిశీలకులుగా పంపించడం జరిగింది. ఈ సందర్భంగా నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట కాంప్లెక్స్ పరిధిలోని మాగి ప్రాథమికోన్నత పాఠశాల, గోర్గల్ ప్రాథమిక పాఠశాలలలో గురువారం నాడు పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య పాఠశాల గదుల సంఖ్య, మరుగుదొడ్ల సంఖ్య, ఉపాధ్యాయులు పనిచేయుచున్న వారి వివరాలను సేకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఆర్పి బి.శ్రీధర్ కుమార్ ఛాత్రోపాధ్యాయురాలు షైక్ హున్నీసా, గోర్గల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు శివశంకర్, మాగి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సమీనా బేగం ఉపాధ్యాయులు భీమ్ రావు, ప్రవళిక, విగ్నేశ్వరి, శైలజ పాల్గొన్నారు.

పోచారంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని రుద్రూరు మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగయ్య, బాల్‌రాజ్, రాములు, నాగేందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో బాల్య వివాహం

నవీపేట,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరిలో ఈ నెల 14న బాల్య వివాహం జరిగిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధాలక్ష్మి తెలిపారు. నవీపేటకు చెందిన మైనర్ బాలిక కుటుంబ సభ్యులు గత కొన్ని సంవత్సరాలుగా రెంజల్ మండలం కందకుర్తిలో నివస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 14న అనంతగిరిలో పద్మనాభ స్వామి ఆలయంలో అదే గ్రామానికి చెందిన 22సంవత్సరాల యువకుడితో నవీపేటకు చెందిన 16సంవత్సరాల బాలికతో వివాహాన్ని కుటుంబ సభ్యులు జరిపించారని ఆమె వివరించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వెంటనే తాము పోలీసుల సహయంతో సంబంధిత బాలికను నిజామాబాద్‌లోని సఖీ కేంద్రానికి తరలించడం జరిగిందని సూపర్‌వైజర్ పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు.

స్నేహితుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన పామయ్యగారి శ్రీకాంత్ గౌడ్ కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా శ్రీకాంత్ గౌడ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. శ్రీకాంత్ గౌడ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా తమ చిన్ననాటి మిత్రుడైన శ్రీకాంత్ గౌడ్ చనిపోవడంతో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు గురువారం అంత్యక్రియల సందర్భంగా 25 వేల నగదును అందజేశారు.

తాగునీటి కోసం కాలనీ వాసుల అవస్థలు

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాటేపల్లి ఎస్సీ కాలనీలో తాగునీరు సరిగ్గా అందక కాలనీవాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీకి సంబంధించి ఒకే నల్లా ఉండటంతో దాని నుండే నీరు తీసుకవెల్తున్నామని కాలనీవాసులు తెలిపారు. చాలా రోజుల నుండి తమకు మిషన్ భగీరథ నీరు రావడంలేదని, కాలనీలో ఉన్న నల్లా నుండే నీటిని తీసుకవెల్తుమన్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో నీటికి చాలా ఇబ్బందిగా ఉందని అధికారులు స్పందించి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయం గురించి మిషన్ భగీరథ ఏఈ సాదిక్‌ను వివరణగా కోరగా మిషన్ భగీరథ నీరు వాటర్‌ట్యాంక్ వరకు వెల్తుందని, ఇంట్రా సప్లై తమ పరిధిలోకి రాదని తెలిపారు.

కోమన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌నర్సారెడ్డి

వేల్పూర్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం కోమన్‌పల్లి గ్రా మంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొనుగోలు కేంద్రం నిర్వహణ బా ధ్యతలు ఐకేపీ మహిళ సంఘానికి కేటాయించడం జరిగిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని మధ్యదళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీఏపీఎం మాణిక్యం, సొసైటీ వైస్ చైర్మన్ నవీన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దామోదర్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు నరేష్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ప్రవీణ్, ఏఈవో ప్రశాంత్, నరేష్, రాజేశ్వర్, సచిన్, గ్రామ కార్యదర్శి సీసీ ప్రవీణ్, గ్రామాభివృద్ధి కమిటి, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మెండోర: మండలంలోని వెల్కటూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వేల్పూర్‌మార్కెట్ కమిటి చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని మధ్య దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, విక్రంరెడ్డి,రాజేందర్,రవి,సాయి,రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రి రోడ్డు, పెర్కిట్ లో గురువారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాల న్నారు.ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ,సీవో రాజ లింగం, రైతులు పాల గంగాధర్, బండి పోశెట్టి, కలిగోట్ నడ్పి గంగాధర్, ఖాందేష్‌సత్యం, లక్కాకుల రాజేశ్ పాల్గొన్నారు.

పింక్ డైరీలకు భయపడే నాయకులం కాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆగ్రో చైర్మెన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడటౌన్ , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు అనుక్షణం ప్రజల కోసం కష్టపడి పనిచేస్తారని , ఎవరు ఏ డైరీలలో రాసుకున్నా ఒరిగిదేమిలేదని రాష్ట్ర ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బాన్సువాడకు విచ్చేసిన ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ నాయకులను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకుల పేర్లను పింక్ డైరీలో రాసుకుంటున్నామన్న వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. బాన్సువాడ ప్రజలకు కష్టపడి పనిచేసే నాయకులపై నమ్మకం ఉందని , మాయలోల్ల మాటలు నమ్మరన్నారు. ఏ మహిళ కూడా చేయనటువంటి లిక్కర్ స్కాం చేసి అభాసుపాలైన ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ నాయకులను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. పింక్ డైరీలలో బినామీల పేర్లు రాసుకుని ఆస్తులు కాపాడుకునే నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనవసరపు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, గురువినయ్, ఏజాస్, నార్ల సురేష్, ఖాలేక్, చిన్న, అజీం, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వివక్షపై రైతుల ఆగ్రహం

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని కొత్తపల్లి సొసైటీ పరిధిలో గల లింగాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లపై సహకార సంఘం అధికారులు వివక్ష చూపుతుండడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం పరిధిలోని రాంపూర్, ఎక్లాస్‌పూర్, సుద్దులం శివారు రైతులకు గన్నీ బ్యాగులు ఇస్తూ లింగాపూర్ గ్రామ రైతుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కొత్తపల్లి సహకార సంఘం కార్యదర్శిని గురువారం రైతులు చుట్టుముట్టి నిలదీశారు. లింగాపూర్ శివారులో ధాన్యం పండించిన రైతులు పొతంగల్, రుద్రూరు రహదారిపై ధాన్యం వేయడం వల్ల వాహనరాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు తెలిపారు. ధాన్యం రాసులతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ఈ సమస్యపై సొసైటీ చైర్మన్‌కు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. కార్యదర్శి సైతం లింగాపూర్ శివారు రైతులపై నిర్లక్ష్యం చూపుతున్నారని వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగాధర్ లింగాపూర్ గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. గన్నీ బ్యాగులు ఇవ్వడంతో పాటు రెండు రోజుల్లో కాంటాలు పెంచి ధాన్యం తూకం వేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరి జైలుశిక్ష

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కోటగిరి ఉమ్మడి మండలంలో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ కేసులో మహారాష్ట్రలోని దెగ్లూర్ గ్రామానికి చెందిన సాయినాథ్ అనే వ్యక్తి పట్టుబడ్డారని ఎస్సై సునీల్ తెలిపారు.సాయినాథ్‌ను కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్ న్యాయాధికారి శేషతల్పసాయి ఒకరోజుజైలుశిక్ష విధించడంతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారని ఎస్సై తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే ఇక జైలుకే..

మోస్రా: చందూర్ మండలంలోని కారేగావ్ తండా గ్రామానికి చెందిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు. ఉమ్మడి వర్ని మండల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రోజున కారేగాం తండా గ్రామానికి చెందిన కోర్ర కాంగ్ర్య అనేవ్యక్తి మద్యం సేవించి మోటార్ సైకిల్ నడుపుతుండగా అతనికి డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేయగా పరిమితికి మించి మద్యం సేవించి వాహనం నడుపుతున్నారని అతనిపై పెట్టి కేసు నమోదు చేసి బోధన్ కోర్టునందు ప్రవేశపెట్టగా సెకండ్ క్లాస్ న్యాయాధికారి తెలిపిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించారని ఉమ్మడి వర్ని మండల ఎస్సై మహేష్ తెలిపారు.

అన్నను హత్య చేసిన కేసులో తమ్ముడికి జీవిత ఖైదు

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రానికి చెందిన దిమ్మెల్‌వార్ విఠల్‌కు బోధన్ అడిషన్ న్యాయాధికారి రవి కుమార్ జీవిత ఖైదు విధించినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. పొతంగల్ గ్రామానికి చెందిన దిమ్మెల్‌వార్ గోవింద్(55)అనే వ్యక్తిని అతడి తమ్ముడు విఠల్ 04-04-2024న దారుణంగా హత్య చేశాడు. ఈ కేసులో విఠల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఈ కేసులో విఠల్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని ఎస్సై తెలిపారు. ఈ కేసులో బాధితుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు వాదనలు వినిపించారన్నారు.

నేడు కందకుర్తికి హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి రాక

రెంజల్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రంలో నేడు లోకమాత అహల్యబాయి విగ్రహ ప్రతిష్టాపనతో పాటు శ్రీ విఘ్నేశ్వర, శ్రీ కుమార స్వామి(స్కంద), రుక్మిణి పాండురంగ, శ్రీకేశవ మూర్తి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి విచ్చేస్తున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు విగ్రహాల ఊరేగింపు, రెండవ రోజు గోపూజ, విఘ్నేశ్వర పూజ, నవగ్రహాల మండపూజ, వాస్తుపూజ, పుష్పాధివాసం, గోపూజతో మొదలుకుని ప్రతిష్టాపనను శ్రీశ్రీశ్రీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి చేతులమీదుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్లమీదే వరి ధాన్యం రాశులు

- నత్తనడకన వరి ధాన్యం కొనుగోళ్లు
- పట్టించుకోని అధికారులు
- పలు గ్రామాల్లో వరి కుప్పల వద్దే రైతుల పడిగాపులు

మోపాల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట పండించినప్పటి నుండి వరి ధాన్యాన్ని అమ్ముకునే వరకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో వరిధాన్యం రోడ్ల మీద, కల్లాల వద్ద రాసులు రాసులుగా పోసి ఉంచారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొంత మంది రైతుల ధాన్యం కొనుగోలు చేశారని పలు గ్రామాల రైతులు వివరించారు. ఇంకా అనేక మంది రైతుల ధాన్యం ఎక్కడికక్కడ వరి పొలాల వద్ద రాసులుగా పోసి ఉంచామని పలువురు రైతులు తెలిపారు. ఇప్పటికే ఎండ తీవ్రత ఎక్కువైంది. మే నెలలో ఇంకా ఎండలు ఎలా ఉంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల ధాన్యాన్ని తొందరగా కొనుగోలు జరిగే విధంగా చూస్తే రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని తెలిపారు. ధాన్యం పోయేంత వరకు అనేక మంది రైతులు ధాన్యం రాసుల వద్దనే రాత్రింబవళ్లు అక్కడే ఉండవల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు. మండలంలోని బాడ్సి, మోపాల్ ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో రైతులు ఎక్కువగా ఉన్నారు. అనేక మంది రైతులు వరి తప్ప వేరే ధాన్యాన్ని పండించరు. దీంతో రెండు సొసైటీలలో కొనుగోలు కేంద్రాలు సుమారుగా నెల 15 రోజుల వరకు కొనసాగుతూనే ఉంటాయి. రైతులకు వాతావరణం అనుకూలిస్తే ఇబ్బందులు ఉండవని ఒకవేళ వర్షం పడితే రైతులకు ఇబ్బందులు తప్పవని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న కొనుగోలు కేంద్రాలు వేగవంతంగా జరిగేలా అధికారులు చూడాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.





వరి ధాన్యం కుప్పలు

కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలి

● దేవయ్య, రైతు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మరింత వేగవంతంగా చేయాలి. ఇప్పటికే అనేక గ్రామాల్లో రైతులు ఎక్కడికక్కడ రోడ్ల మీద వారి వారి పొలాల వద్ద ధాన్యాన్ని రాశులు రాశులుగా పోసి ఉంచారు. వాతావరణం అనుకూలించక పోతే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. మరికొన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తొందరగా కొనుగోలు చేసే విధంగా చూడాలి.



కోనాపూర్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డైట్ కళాశాల బృందం

కోనాపూర్ పాఠశాలను పరిశీలించిన రాష్ట్ర బృందం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో సదుపాయాలు సౌకర్యాలను యూ డైస్ రాష్ట్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఎడ్యూకేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ డైట్ కళాశాల బృందం సభ్యురాలు నాగమణి పాఠశాలలోని మౌలిక వసతులు, సౌకర్యాలు, యూ డైస్ వివరాలు పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల, ఉపాధ్యాయుల పూర్తి వివరాలతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాలు తరగతి గదులు, మరుగుదొడ్ల సౌకర్యం, క్రీడాస్థలం, మినరల్ వాటర్ ఫిల్టర్, ర్యాంప్, కంప్యూటర్లు, వాన నీటి సంరక్షణ ఇంటిగ్రేటెడ్ ప్లాట్ ప్యానల్, డిజిటల్ తరగతులు, కృత్రిమ మేధా ఆధారిత బోధన, సైన్స్, గణిత ల్యాబొరేటరీలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పరిశీలన నివేదికను జిల్లా విద్యాధికారికి సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌడారపు రామ్ ప్రసాద్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'న్యాయవాదులకు రక్షణ కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ అన్నారు. గురువారం బార్ అసోసియేషన్ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్న మంతాపురం కిశోర్ అనే న్యాయవాదిపై కొందరు కక్షిదారులు కక్షతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యాయవాది స్వార్థపూరితంగా పనిచేయడని కక్షిదారుల నిజపత్రాలతోనే వాదప్రతివాదనలు చేయడం జరుగుతుందని తన వృత్తి ధర్మాన్ని మాత్రమే పాటిస్తాడని అన్నారు. న్యాయవాదులపై దాడులు రోజురోజుకు పెరుగుతూ హత్యలు సైతం జరుగుతున్నాయని ఇది సమంజసం కాదని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రక్షణ చట్టం వచ్చేవరకు రిలే నిరాహారదీక్షలో చేయడం వెనకాడబోమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గటడి ఆనంద్, కోశాధికారి చైతన్య, న్యాయవాదులు కృష్ణాపండిత్, ఎంకే నరేందర్, ఆర్కే సురేష్, జగన్, కృష్ణంరాజు, తెడ్డు నర్సయ్య, ఖాందేష్ సంగీత, విజయలక్ష్మీ, వెంకటేశ్, షిండే పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇళ్ల స్థలాల్లో నిర్మాణం చేపట్టరాదు

● తహసీల్దార్ మాలతి

ధర్పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇప్పటికే ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందని అట్టి ఇళ్ల స్థలాల్లో ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టని వారు ఇకపై అట్టి ఇళ్ల స్థలాల్లో ఏ నిర్మాణాలు చేపట్టరాదని తహసీల్దార్ మాలతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోగల తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుం టుందని ఆమె చెప్పారు. ఇకపై ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాల్లో ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించారు. ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మండల కేంద్రంలో గల బీసీ కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాల్లో ఒకటి కంటే ఎక్కువ మంది కబ్జాలకు పాల్పడుతున్నారని ఇకపై అలాంటి ఖాళీ స్థలాల్లో ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ఆదేశాలు అతిక్రమిస్తే ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో డీటీ ప్రవీణ్, ఆర్ఐ రాజేశ్వర్ ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రిలయన్స్ స్మార్ట్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్, వివిధ వ్యాపార సముదాయాలలో వినియోగదారులకు, ప్రజలకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, నజీమ్, ఆనంద్, రాహుల్, మాసిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు సభవించినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

ఆర్మూర్ టౌన్: అగ్ని ప్రమాదాలు సంభ వించినప్పుడు జాగ్రత్తలు వహించాలని అగ్ని మాపక అధికారి జె. మదుసుధన్ రెడ్డి అన్నారు. గురువారం అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా పలు ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఫైర్ ఎక్టిటింగ్ విషర్స్ అలాగే ఫైర్ సిస్టం హౌజ్ రీల్స్ హైడ్రెంట్ ఉపయోగాలను వివరించి వాటితో పని చేసే విధానాన్ని ఆసుపత్రి యాజమాన్యాలకు, సిబ్బందికి తెలియజేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు రోగులను బయటకు తీసుకువచ్చే విధానాన్ని వివరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మద్నూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అగ్ని మాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎల్‌పిజి వాడకం పూర్తయిన వెంటనే రెగ్యూలేటర్ వ్యాల్వ్యా ఆపివేయాలని, గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వ్యాల్వ్యా ఆపివేయాలని సూచించారు. అటువంటి సమయంలో ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయొద్దని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు ఇళ్లలో ఉన్న సమయంలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ఇటువంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండుతున్న స్టౌలో కిరోసిన్ పోయరాదని. వంట గదిలో కిరోసిన్, డీజిల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచరాదని అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పు అంటుకున్నట్లయితే పరిగెత్తకుండా నేలపై దొర్లాలని దుప్పటి చుట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఎస్సై రాజయ్య, సిబ్బంది నర్సింలు, దిగంబర్ పాల్గొన్నారు.



మద్నూర్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది



నీడ కోసం చెట్టును ఆశ్రయించిన మేకలు

నీడ, నీళ్ల కోసం పశువుల పాట్లు



నీళ్ల కోసం పాట్లు పడుతున్న పశువులు

మద్నూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎండలు దంచుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుంది. ప్రజలు వేసవి కాలంలో తమకు కావలసిన సౌకర్యాలను సమకూర్చుకుంటున్నారు. కానీ నోరులేని పశువుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రజలు ఎండలకు భయపడి బయట పోవడానికి జంకుతున్నారు. పశువులు మాత్రం గడ్డి కోసం నీళ్ల కోసం నీడ కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది అయినప్పటికీ వాటికి నీళ్ల మేత దొరకక ఇబ్బందులు పడుతున్నాయి. నోరులేని పశువులు తమ తిప్పలు చెప్పుకునే పరిస్థితి లేకపోగా అవి నీడ కోసం, నీళ్ల కోసం, మేత కోసం ఎలా తాప్రతాయ పడుతున్నాయో పై ఫోటోలో కనిపిస్తున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులు నీడ కోసం చెట్లను ఆశ్రయిస్తుండగా, మేత కోసం నీళ్ల కోసం, ఎండను సైతం లెక్కచేయకుండా అడవి ప్రాంతంలో తిరుగుతున్నాయి. వేసవి మొదట్లోనే తాగునీటి పరిస్థితి, ఎండలు ఇలా ఉంటే పెద్దలు చెప్పిన సామెత ప్రకారం మే నెలలో ఎండలకు రోళ్ళు పగులుతాయాన్న నానుడి నిజం కావచ్చునేమో..? గ్రామీణ ప్రాంతాల్లో గతంలో నిర్మించిన పశువులు తొట్టిలు మత్తులకు నోచుకోక నీళ్ల కోసం పశువులు చెట్టు పుట్ట వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో నిర్మించిన పశువుల తొట్టిలకు మరమ్మతులు చేయించినట్లయితే గ్రామంలోని వాటికి నీటి సౌకర్యం కల్పించినట్లు అవుతుంది.

విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

● టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి



టీయూలో ప్రత్యేక పూజలు చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి



నిర్వాహకులను అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు భక్తితో హిందూ సంస్కృతిక సంప్రదాయలను కాపాడుకోవాలని ఐక్యమత్యంతో కలిసి హనుమాన్ ఆశీస్సులు పొందాలని రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. గురువారం టీయూలో హనుమాన్ ఆలయం వద్ద హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఐఖ్యతతో కలిసిమెలిసి ఉండాలన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను రిజిస్ట్రార్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి ఆశోక్, కమిటీ సభ్యులు అక్షయ్, మనోజ్, శివా, వినోద్ పాల్గొన్నారు.

వైభవంగా శివగంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



హసాకొత్తూర్ గోనె చెరువులో శివగంగమాత ఆలయం



గర్భగుడిలో శివ గంగామాత



హసాకొత్తూర్‌లో వలగొడుగు ఉత్సవం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ గోనె చెరువులో కొలువుదీరి ఉన్న గంగపుత్రుల ఆరాధ్య దైవం శివగంగమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహింపబడే గంగమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా తొలిరోజు గురువారం గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు వలగొడుగు ఉత్సవాన్ని నిర్వహించారు గ్రామం నుంచి గోనె చెరువులోని శివ గంగమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు జిమ్మిగారి అజయ్ శర్మ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జుంబెరాత్ శంకర్, కార్యదర్శి ఎల్ల నర్సయ్య, కోశాధికారి ఆల్గోట్ నారాయణ, సొసైటి అధ్యక్షుడు ఆల్గోట్ రమేష్, కార్యదర్శి నారాయణ, గంగమ్మ దేవి దీక్షపరులు, గంగపుత్ర సంఘ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. 18 శివ గంగాభవాని కల్యాణం, బోనాల సమర్పన, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గంగామాతకు గోనె చెరువులో చక్రస్నానం పల్లకి ఊరేగింపు ఉంటాయని తెలిపారు.

ఎమ్మెల్యే ఆదేశించినా.. అధికారులకు పట్టదా!?

● చెరువు భూమిని సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశం ● కబ్జాలకు గురవుతున్న ఈదుల్లా చెరువు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కన గల ఈదుల్లా చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంటుంది. చెరువుకు చుట్టూ పక్కల భూములున్న ఉన్న వారు టాక్టర్‌లతో కొద్ది కొద్దిగా చదును చేస్తూ చెరువు భూమిలోనికి వస్తున్నారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్ల పేరుతో కబ్జాలకు పాల్పడుతున్నారు. ఎంతో విలువైన ఈ చెరువు భూములను కబ్జా చేయాలనే కొందరు రియల్టర్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. వేసవి దృష్ట్యా చెరువులో నీటి స్థాయి తగ్గిపోవడంతో ఇదే అదునుగా కబ్జాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు మట్టి కుప్పలను చెరువుల్లో వేసి కబ్జాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో ఇప్పటికే నడిపల్లి గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన రెవెన్యూ అధికారులను పిలిచి మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు భూమిని కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్‌కు సూచించి ఏడాది గడిచిన ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. సర్వే చేయించి చెరువు చుట్టూ హద్దు రాళ్లు వేయించి కబ్జాలు అడ్డుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అయిన ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు అటూ వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో కబ్జా రాయుళ్ల మరింత రెచ్చిపోతు న్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎమ్మెల్యే ఆదేశాల ను పట్టించుకొని చెరువు హద్దులను గుర్తించి చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువు కబ్జాపై తహసీల్దార్‌తో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి (ఫైల్)



డిచ్‌పల్లి మండల కేంద్రంలో కబ్జాకు గురవుతున్న ఈదుల్ల చెరువు ఇదే

జిల్లా ప్రధాన న్యాయాధికారికి వీడ్కోలు


జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సునీత కుంచాలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం సాయంత్రం జిల్లా కోర్టు భవన సముదాయంలోని ఛాంబర్‌లో జడ్జిని కలిసిన కలెక్టర్ ఆమెకు పూలబుకేను అందించి జ్ఞాపికను బహూకరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా కలెక్టర్ ప్రస్తావిస్తూ అభినందనలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరపున విశేష తోడ్పాటును అందించారని ఆమె కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సిరికొండలో రౌండ్‌టేబుల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

సిరికొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్, రూరల్, కామారెడ్డి జిల్లాల సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ.. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మత ఫాసిజాన్ని తరిమికొడదామని అన్నారు. చరిత్రను వక్రీకరించి అబద్ధాలను ప్రచారం చేస్తూ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. దేశాన్ని మొత్తం కార్పొరేట్ శక్తులకు అప్పగించి ప్రజలను మాత్రం మతం మత్తులో ముంచుతున్నారని అన్నారు. హిందూ ముస్లిం, క్రిస్టియన్ దళిత్ ఏక్ హై అన్న స్ఫూర్తితో జేఏసీని ఏర్పాటు చేయడం కోసం మాస్‌లైన్ సిరికొండ మండల కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి, ముస్లిం మండల కమిటీ అధ్యక్షుడు లియాకత్, క్రిస్టియన్ సంఘం అధ్యక్షుడు ఏసురత్నం, ఉపాధ్యాయ సంఘం నాయకులు బాలయ్య, సాల్మాన్, మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి ఫెరోజ్‌ను సస్పెండ్ చేస్తున్నాం


మాట్లాడుతున్న టీడీపీ నగర అధ్యక్షుడు సత్యనారాయణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నుంచి మైనార్టీ నాయకుడు ఫెరోజ్, షైమద్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు నగర పార్టీ అడహక్ కమిటీ సభ్యుడు అంబిక సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫెరోజ్ ఇతర పార్టీలతో చేతులు కలిపి పార్టీకి చెడ్డపేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికీ పలుమార్లు పార్టీ మారిన క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని తెలిపారు. పార్టీని కావాలని నాశనం చేస్తుంటే ఊరుకునేది లేదన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ నాయకుల సంతకాలు సేకరించి తీర్మానం చేశామన్నారు. ఇప్పటి నుంచి ఫెరోజ్‌కు తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ సమావేశంలో పురుషోత్తం, లవంగరాజు, జాఫర్, సర్ఫరాజ్, రషీదాబేగం, సలీం, నాగేశ్వర్‌రావు, రాజేశ్వర్, అజీజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మూడు బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో మూడు బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో దిలీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడు బార్లు ఏర్పాటు చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు లక్ష రూపాయల డీడీ, నాన్ రిఫండబుల్, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డుతో పాటు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 26 సాయంత్రం 5 గంటల వరకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 29న కలెక్టర్ చేతుల మీదుగా లక్కీడ్రా తీయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడైనా ఐదు కిలోమీటర్లలోపు మోపాల్, మానిక్‌భండార్, నాగారంలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. బార్లకు ప్రత్యేక నెంబర్ ఇవ్వనందున వచ్చిన అభ్యర్థుల టోకెన్లను మూడు బార్ల కోసం తీయడం జరుగుతుందన్నారు. వివరాలకు ఎస్‌హెచ్‌వో నిజామాబాద్‌ను సంప్రదించాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు


మహిళలకు వివరిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్యాస్ గోడౌన్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గుండారంతో పాటు వివిధ ప్రాంతాల్లో గల హెచ్‌పీ, భారత్, ఇండిఎన్ గ్యాస్ గోడౌన్‌లో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్యాస్ లీకైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ అవగాహన సదస్సులో అగ్నిమాపక అధికారి నర్సింగ్‌రావు, సుమన్, ప్రశాంత్‌గౌడ్, సురేందర్, రుత్విక్, విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలో జిల్లా క్రీడాకారులకు పతకాలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సీనియర్ ఇంటర్ జోనల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలో జిల్లా క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించారు. ఏప్రిల్ 14 నుంచి 16 వరకు జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లోని బక్షీ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో వినయ్, మహిళల విభాగంలో వైశాలి, సౌమ్యరాణి, మౌనిక, నేహశ్రీలు పతకాలను సాధించారు. క్రీడాకారులను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

అంజన్‌కుమార్, అద్దంకి దయాకర్‌లపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తీవ్రంగా ఖండించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీ పేర్లు చార్జ్‌షీట్‌లో చేర్చడంతో కాంగ్రెస్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి సమక్షంలోనే కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం అని మండిపడ్డారు.

పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి ప్రాధాన్యం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్/సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని సుభాష్‌నగర్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లు తమ అనుభవాన్ని ప్రజాసంక్షేమం కోసం వినియోగించి సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర శాఖల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన సీనియర్ సిటిజన్స్ అందరూ వారి అనుభవాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని అన్నారు. విశ్రాంత ఉద్యోగులు సరోజిని అమ్మను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్, ఇతర సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం కోసం యోగా కేంద్రం, లైబ్రరీ ఏర్పాటుకు ప్రభుత్వ నిదులు సమకూర్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన భవనం ఏర్పాటు అయిన సందర్భంగా భవనానికి ఉపయోగపడే వంద కుర్చీలను ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్‌గుప్త చారిటబుల్ ట్రస్ట్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న ప్రముఖులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ట్రెజరీ దశరథ్, మహిళా శిశుసంక్షేమ వయోవృద్ధుల శాఖ జిల్లా అధికారి రసూల్‌బీ, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సహకారం వెలకట్టలేనిది

● బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత


జిల్లా ప్రధాన న్యాయాధికారికి వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

నిజామాబాద్ లీగల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మూడున్నర ఏళ్ల పదవీకాలంలో న్యాయాన్ని న్యాయమూర్తులకు అందించడంలో న్యాయవాదుల సహకారం వెలకట్టలేనిదని బదిలీపై వెళ్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి మానిక్‌రాజ్‌ల ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు.. బార్ అండ్ బెంచ్ ఉమ్మడి లక్ష్యం కక్షిదారులకు కాలానుగుణంగా న్యాయసేవలు అందించడం తన లక్ష్యసాధనలో సాధ్యమైందని అన్నారు. న్యాయ వ్యవస్థ సఫలీకృతమైందని అయినా ఇంకెంతో చేయాల్సి ఉందని ఆమె అన్నారు. అనంతరం సీనియర్ న్యాయవాదులు కృపాకర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, అజార్ కిషన్‌రావులు మాట్లాడుతూ.. ఆమె జిల్లాలో ఎంతో మందికి నిరుద్యోగులకు, ట్రాన్స్ జెండర్లకు జీవనోపాధి కల్పించి వారి భవిష్యత్తును మెరుగుపర్చిందని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ కాలం జిల్లా జడ్జిగా అనుబంధం పెంచుకున్న మొదటి జడ్జిగా మీరే ఉన్నారని అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు సురేష్, దిలీప్, సంయుక్త కార్యదర్శి జాన్సీరాణి, కోశాధికారి నారాయణ, లైబ్రరీ కార్యదర్శి శ్రీమన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

యేసుప్రభు త్యాగానికి ప్రతిరూపం

● నేడే గుడ్‌ఫ్రైడే

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):ప్రపంచ శాంతిని కోరుతూ యేసు ప్రభువు త్యాగానికి ప్రతిరూపంగా గుడ్‌ఫ్రైడేను నిర్వహిస్తారు. ప్రతియేటా చర్చిలలో యేసుప్రభువు త్యాగాన్ని గుర్తుచేస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధం అయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు యేసు ప్రభువు సేవలు ఆయన చూపిన మార్గంపై మతపెద్దలు ప్రవచనాలు చేస్తారు. ఈరోజున క్రైస్తవులు ఉపవాస దీక్షతో పూజించడం వల్ల యేసు యొక్క అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. గుడ్‌ఫ్రైడే తర్వాత వచ్చే ఆదివారం రోజున ఈస్టర్ పండుగను జరుపుతారు.జిల్లాకేంద్రంలోని సీఎస్‌ఐచర్చి, నిర్మల హృదయచర్చి, గ్లోరియస్ చర్చిలు పర్వదినానికి సిద్ధం అయ్యాయి.

నేడు నడిపల్లి రైతు వేదికలో భూభారతిపై అవగాహన సదస్సు

డిచ్‌పల్లి ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నడిపల్లి రైతు వేదికలో నేడు శుక్రవారం భూభారతిపై రైతులకు అవగహన సదస్సు జరగనుందని ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆర్డీవో రాజేందర్ కుమార్, హాజరవుతున్నారని రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు తరలిరావలని డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ సంతోష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం అమలు లోకి తీసుకొచ్చిన తర్వాత రైతుల సందేహాలకు నివృత్తి చేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు.

నేడు బీజేపీ నూతన ఎమ్మెల్సీలకు ఆత్మీయ అభినందన సభ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):నూతన ఎమ్మెల్సీగా గెలుపొందిన అంజిరెడ్డి, మల్క కొమురయ్యల కు ఆత్మీయ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వర్ని చౌరస్తాలోగల జనార్థన్ గార్డెన్‌లో అధ్యక్షు డు దినేష్‌కులాచారి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారా యణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డిలు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా బీజేపీ నాయకుడు, టీచర్లు, గ్రాడ్యుయేట్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

22న వార్షికోత్సవ వేడుకలు

డిచ్‌పల్లి ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 22న సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

లాఠీచార్జీలకు, కాంగ్రెస్ కార్యకర్తల దాడులకు భయపడేదీ లేదు

● ఎమ్మెల్సీ కవిత

సుభాష్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):లాఠీచార్జిలకు, కాంగ్రెస్ కార్యకర్తల దాడులకు బయపడేది లేదని ఎమ్మెల్సీ కవిత తన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నించడమే నేరమా అని అన్నారు. కళ్యాణలక్ష్మీ పథకం కింద తులం బంగారం ఏమైందని అడిగినందుకు భీంగల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలపై మంత్రి జూపల్లి కృష్ణారావు పోలీసులను ఉసిగొలిపి లాఠీచార్జి చేయించి తన కర్కశత్వాన్ని ప్రదర్శించారని అన్నారు. హామీల అమలుపై ప్రశ్నిస్తూనే ఉంటామని కాంగ్రెస్ నాయకులను నిలదీస్తూనే ఉంటామని అన్నారు. లాఠీలను చూపించి బయపెట్టడం కాదని చేతనైతే హామీలను అమలు చేసి చూపించాలన్నారు. లాఠీచార్జికి పాల్పడిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీని డిమాండ్ చేశారు.

వెసెక్టమీ ఆపరేషన్‌ల ద్వారా ఏలాంటి సమస్యలు ఉత్పన్నం కావు

డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్

డిచ్‌పల్లి ఏప్రిల్17 (ఆంధ్రజ్యోతి):ప్రస్తుత పరిస్థితుల్లో పురుషులు జనాభా నియంత్రణ కోసం వెసెక్టమీ ఆపరేషన్ల కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్ అన్నారు.గురువారండిచ్‌పల్లి సీహెచ్‌సీలో వెసక్టమి అపరేషన్‌లకు వచ్చిన వారికి మనోధైర్యం అందజేశారు. స్త్రీలకంటే పురుషులు వెసక్టమి అపరేషన్‌లు చేయించుకోవడం ఎంతోసులభతరమ న్నారు. అపరేషన్ చేయించుకుంటున్న వారిని ఆయన అభినం దించా రు.

బుస్సాపూర్‌లో బడిబాట

మెండోర,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్సాపూర్ ఉన్నత ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ బడులోకి పంపించాలని సూచిం చారు. మెండోర మండల ప్రత్యేకధికారి అంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం ఎన్నో వసతు లు కల్పించిందని ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, శమంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

ఆర్మూర్‌రూరల్ , ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో శుక్రవారం జూనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగమోహన్ తెలిపారు.ఆసక్తిగల క్రీడాకారులు సాయంత్రం 4 గంటలకు జిల్లా కోచ్ నరేష్‌కు రిపోర్ట్ చేయాలన్నారు. ఎంపిక పోటీలలో పాల్గొనేక్రీడాకారులు 1-1-2008 తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు.

నిజామాబాద్ పార్లమెంటరీ స్థాయి సమీక్షకు హాజరైన జిల్లా నాయకులు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):గాంధీభవన్‌లో గురువారం నిర్వహించిన నిజామాబాద్ పార్లమెంటరీ స్థాయి సమీక్షకు జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తో పాటు ఏఐసీసీ కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నిజామాబాద్ పార్లమెంటరీ స్థాయి సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు తాహెర్‌బిన్ హందాన్, అన్వేష్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, గత ఎన్నికల్లో పోటీ చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జీలు సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు రత్నాకర్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లడం అనే అంశాలను చర్చించినట్లు తెలుస్తుంది. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చర్చించినట్లు తెలుస్తుంది.

● గ్రంథాలయాన్ని సందర్శించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గురువారం సందర్శించారు. గ్రంథాలయంలోని పలు విభాగాలను ఆయన పరిశీలించి గ్రంథాలయ సంస్థ చైర్మన్, అధికారులను గ్రంథాలయ నిర్వాహణపై వివరా లతో పాటు పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల అభిప్రాయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు గ్రంథాలయంలో అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, కార్యదర్శి బుగ్గారెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, మానాలమోహన్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నగేష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్‌రావు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి

'చిన్నారులకు అండగా ఉంటాం'

ధర్పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అనూష ఇటీవల మృతి చెందడంతో ఆమె ఇద్దరు కొడుకులు అనాథలు అయ్యారు. దీంతో గురువారం మాజీ ఎంపీపీ, రాష్ట్ర ముదిరాజ్ మహాజన సభ నాయకుడు ఇమ్మడిగోపి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి రూ.10వేల నగదును అందజేశారు. వారికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మచ్చ రఘురాం ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందిలో ఏడుగురికి జైలు శిక్ష, ఐదుగురికి జరిమానా విధించారు. సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జాన్ ముందర వారిని హాజరుపర్చగా ఐదుగురికి రూ.8500లు జరిమానా విధించగా, ఒకరికి ఒకరోజు, ఆరుగురికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు.

'ప్రశాంత్‌రెడ్డి చౌకబారు ఆరోపణలు మానుకోవాలి'

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి లేనిపోని రాద్ధాంతం చేసిన రాజకీయ కుట్రను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రశాంత్‌రెడ్డికి కనిపించడం లేదా అని అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారని కానీ కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నర కాలంలో చేస్తున్న అభివృద్ధి పనులు చూడలేక, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూడలేక ప్రశాంత్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. షాదీముబారక్, కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఖచ్చితంగా తులం బంగారం ఇచ్చి తీరుతామని బీఆర్‌ఎస్ పార్టీలాగా తాము ప్రజలను మోసం చేయమన్నారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ప్రొటోకాల్ విషయంలో ప్రశాంత్‌రెడ్డి ఏ విధంగా ప్రవర్తించాడో చూసుకోవాలని అధికారిక కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు చెక్కులు పంపిణీ చేసిన సంగతి మర్చిపోయారా అని అన్నారు. లేనిపోని రాద్ధాంతం చేసి మంత్రిని అవమానించిన తీరు సరైందికాదని ఆయన అన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ప్రశాంత్‌రెడ్డి గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉండదని ఆయన హెచ్చరించారు.

నేడు భూ భారతిపై సదస్సు

మోపాల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదిక భవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు భూభారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ రామేశ్వర్ తెలిపారు. ఈ సదస్సుకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు,రూరల్ ఎమ్మెల్యేడాక్టర్ భూపతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని రైతులు హాజరుకావాలని కోరారు.

మంత్రి జూపల్లిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఏర్గట్ల,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంగ్రెస్ నాయకులు బుధవారం రాత్రి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణరావును కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఇటీవలే ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఉన్న బట్ట ముసగును తొలగించే విధంగా తమకు అనుమతి ఇవ్వాలని పలు యువజన సంఘాల తరపున కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, గడ్డం జీవన్, బద్దం లింగారెడ్డి, బెజ్జారపు భాను, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

30ఏళ్ల పోరాట ఫలితమే వర్గీకరణ

భీమ్‌గల్ , ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ముప్పైఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎంఆర్‌పీఎస్ మండల నాయకులు అన్నారు. వర్గీకరణ అమలులకి వచ్చిన సందర్భంగా గురువారం పట్టణ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక కమిటీ సభ్యులు గడాల ప్రసాద్, రాజ్, రతన్, నరేష్, రాజేశ్, రాజేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దేగాంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆలూర్ , ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం దేగాంలో గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. చెక్కులు మంజూరు చేయించిన రాకేష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.95,200	రూ.87,950	రూ.1010

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ఓదెల-2 (10.00, 1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-3 : పద్దింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (11.05)
: జాట్ (హిందీ) (1.30)
: సిన్నర్స్ (ఇంగ్లీష్) (4.40, 7.40, 10.40)
స్క్రీన్-4 : డియర్ ఉమా (11.00)
: ది చూసెన్ లాస్ట్ సుప్పర్ (ఇంగ్లీష్) (2.10)
: జాక్ (4.45)
: పద్దింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (7.40)
: మధురం (10.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓదెల-2 (10.40, 1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-2 : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.00, 10.40)
: ఒక్కడు (1.40, 7.40)
స్క్రీన్-3 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.00, 1.35, 4.30, 7.25, 10.20)

లలితామహల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్